సరుకులు మోయలేక.. సడుగులిరుగుతున్నయ్!

నివాసాలకు దూరంగా రేషన్ దుకాణాలు ● పక్క గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోలేక అవస్థలు ● సర్వర్ మొరాయిస్తుండటంతో డీలర్ల వద్దే పడిగాపులు

ఇంటి వద్దకే వచ్చే బియ్యం బండ్లను ఆపిన కూటమి సర్కారుపై ఆగ్రహం ● వృద్ధులకు ఇళ్ల వద్దే సరుకుల పంపిణీ ఉత్త మాటలే..


కాలినడకన బియ్యం మోసుకెళ్తున్న మహిళలు


తర్లుపాడులో రేషన్‌షాపు ముందు పడిగాపులు కాస్తున్న కార్డుదారులు

మోత భారం తప్పేలా లేదు

☛ మార్కాపురం పట్టణానికి దూరంగా ఉన్న ఇందిరమ్మ కాలనీ వాసులు రేషన్ సరుకులు తీసుకోవాలంటే సుమారు 2 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

☛ కొనకనమిట్ల మండలంలో ముమ్మాయపాలెం, బసాపురం, నాయుడుపేట ఎస్సీ కాలనీ, వెలుగొండ్రాయునిపల్లి, బ్రాహ్మణపల్లి, ఓబుల రెడ్డిపల్లి, సర్వాయపల్లి తదితర గ్రామాల ప్రజలు సుమారు 4 కిలోమీటర్ల దూరం వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకోవాల్సిన దుస్థితి. ప్రతి నెలా అంత దూరం వెళ్లి సరుకులు తెచ్చుకోవాలంటే పనులు మానుకోవాల్సి వస్తోందని, చార్జీల భారం ఎక్కువైందని కార్డుదారులు గగ్గోలు పెడుతున్నారు.

☛ పొదిలి మండలంలోని రాజుపాలెం, కొష్టాలపల్లి, పాములపాడు, జాఫ్లాపురం తదితర గ్రామాల లబ్ధిదారులు మూడు నుంచి పది కిలో మీటర్ల లోపు రాకపోకలు సాగిస్తే కానీ సరుకులు ఇంటికి చేరడం లేదు. పనులు మానుకుని బియ్యం కోసం ఆటోలు, మోటారు సైకిళ్లపై లేదంటే నడిచి రావాల్సి వస్తోందని కార్డుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మార్కాపురం టౌన్/తర్లుపాడు/పొదిలి/కొనకనమిట్ల:

మార్కాపురం నియోజకవర్గంలో రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ కార్డుదారులకు ప్రహసనంగా మారింది. గ్రామాలు, పట్టణ వార్డుల్లోని ప్రధాన రహదారులు, వాహనం వెళ్లేందుకు వీలున్న మార్గాల్లో ఎండీయూ వాహనాల సజావుగా సాగుతున్న రేషన్ సరుకుల పంపిణీని కూటమి ప్రభుత్వం గత నెలలో ఆపేసిన సంగతి తెలిసిందే. పాత పద్ధతిలోనే దుకాణాల వద్ద సరుకులు ఇవ్వాలని నిర్ణయించడంతో కార్డుదారులకు కష్టాలు మొదలయ్యాయి. మార్కాపురం నియోజకవర్గంలోని తర్లుపాడు మండలంలో 19 షాపుల ద్వారా 9,992 మంది కార్డుదారులు, పొదిలిలో 31 షాపుల ద్వారా 18,650, కొనకనమిట్లలో 30 షాపుల ద్వారా 14,971, మార్కాపురం మండలంలో 62 రేషన్‌షాపుల ద్వారా 33,378 మంది మొత్తం 148 షాపుల ద్వారా 76,991 మంది కార్డుదారులకు సరుకులు పంపిణీ చేయాల్సి ఉంది. దుకాణాలకు దూరంగా ఉండే గ్రామాల ప్రజలు కూలీ, వ్యక్తిగత పనులు మానుకుని రేషన్ షాపుల వద్ద పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో నిత్యావసర వస్తువులైన బియ్యం, చక్కెర, కందిపప్పు తదితర వస్తువులను ఇంటి వద్దకే ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేసేవారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే ఇచ్చి పంపుతుండటంతో కార్డుదారులు రగిలిపోతున్నారు. దూరాభారం నుంచి బియ్యం మోసుకెళ్లేలోగా సడుగులు నొప్పి పుడుతున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్డుదారుల కునికిపాట్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాల వ్యవస్థ ప్రజల్లో మన్నన పొందడం ఇష్టం లేని కూటమి సర్కారు కక్షపూరితంగా వ్యవహరించిదన్న విమర్శలు నేటికీ వినిపిస్తున్నాయి. రేషన్ కార్డుదారులు అవస్థలు పడకుండా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విధానాన్ని ప్రజల మది నుంచి చెరిపేసేందుకే ఎండీయూ వాహనాలను నిలిపేసిందని ప్రజా సంఘాల నాయకులు తప్పుబడుతున్నారు. రాజకీయ కక్షతో ప్రజా పంపిణీ వ్యవస్థను తిరోగమనంలోకి నెట్టిన ఫలితంగా కార్డుదారులు రేషన్ దుకాణాలకు వెళ్లేందుకు అయిష్టత చూపుతున్నారు. దీంతో డీలర్లే కార్డుదారుల ఇంటికి వెళ్లి వేలిముద్రలు తీసుకుని బియ్యాన్ని దళారులకు అమ్మేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీనికితోడు కొందరు డీలర్లు సమయపాలన పాటించకపోవడంతో కార్డుదారులు కునికిపాట్లు పడుతున్నారు. పనులు మానుకుని రేషన్ షాపుల వద్దకు వచ్చినా డీలర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కంది పప్పు కోసం ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం గద్దెనెక్కినప్పటి నుంచి రేషన్ దుకాణాల్లో కంది పప్పు పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. కూటమి వచ్చిన తొలి నాళ్లలో దుకాణాలకు కంది పప్పు పూర్తి స్థాయిలో సరఫరా చేయకుండా కొందరికి 40 శాతం, మరికొందరికి 50 శాతం చొప్పున ఇవ్వడంతో అవి ఎవరికి ఇవ్వాలో తెలియక పంపిణీనే నిలిపేశారు. ఇప్పటికీ అదే పరిస్థితి పునరావృతమవుతోంది. ప్రస్తుతం కంది పప్పు బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి కిలో రూ.110 నుంచి రూ.130 వరకు పలుకుతోంది. పౌరసరఫరాల శాఖ కేజీ రూ.67కు అందిస్తే ఇబ్బంది లేకుండా ఉండేది. కానీ నెలల తరబడి కంది పప్పు సరఫరా చేయపోవటంతో అధిక ధరకు బయట మార్కెట్‌లో కొనుగోలు చేయలేకపోతున్నామని కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బియ్యం కోసం 2 కి.మీ పోతున్నాం



మా కాలనీలో సుమారు 370 కుటుంబాలు ఉన్నాయి. రేషన్‌షాపు లేకపోవడంతో 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పూలసుబ్బయ్య కాలనీకి వెళ్లి బియ్యం తీసుకుంటున్నాం. కాలనీలో రేషన్ షాపు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దుకాణం ఏర్పాటుకు చొరవచూపాలి.

– జాన్ డేవిడ్, ఇందిరమ్మ కాలనీ, మార్కాపురం

ఎండీయూ బండ్లుంటే బాగుండేది



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఎండీయూ బండ్లను అలాగే కొనసాగిస్తే బాగుండేది. మే నెల వరకు బియ్యం, కంది పప్పు లాంటి నిత్యావసర సరుకులను ఇళ్ల వద్దకే అందించడం వల్ల ఇబ్బందులు తప్పాయి. ఇప్పుడేమో పనులు మానుకుని గంటల తరబడి రేషన్ షాపుల ముందు పడిగాపులు కాయాల్సి వస్తోంది.

– విజయకుమార్, తర్లుపాడు

సరుకుల కోసం పని పోగొట్టుకోవాలా?



రేషన్ సరుకుల కోసం పేద, మధ్య తరగతి ప్రజలు ఒక రోజు పని పోగొట్టుకోవాల్సి రావడం బాధాకారం. కూలీ పని చేసి పొట్టపోసుకునే వారికి ఒక రోజు వేతనం దక్కకపోతే ఎంత బాధపడతారో ప్రభుత్వం ఆలోచించాలి. ఇళ్లకు, గ్రామాలకు దూరంగా ఉన్న దుకాణాలకు వెళ్లి నెత్తిన మూట పెట్టుకొని నడవలేక మహిళలు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం రేషన్ పంపిణీపై పునరాలోచించి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది.

– కె.కోటేశ్వరరావు, సీపీఐ నాయకులు

వృద్ధులకు ఇళ్ల వద్ద బియ్యం ఎక్కడిస్తున్నారు?



రేషన్ సరుకుల కోసం రాజుపాలెం గ్రామం నుంచి పొదిలి రావాలంటే 5 కిలోమీటర్లు ప్రయాణించాలి. పని మానుకుంటేనే సరుకులు తెచ్చుకునేందుకు వీలవుతుంది. గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు ఆటోలు, బైకులపై వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. ముసలివారి పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. వృద్ధులకు ఇంటి వద్దే సరుకులిస్తామని చెబుతున్నారే కానీ ఎక్కడా అమలు కావడం లేదు.

– జూపల్లి ఏడుకొండలు, మాజీ ఎంపిటీసీ

వైఎస్సార్ సీపీ శ్రేణులు ఐకమత్యంగా ముందుకు సాగాలి


సమావేశంలో మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు ఐకమత్యంగా ముందుకు సాగాలని ఆ పార్టీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలల్లో వైఎస్సార్ సీపీపై అంతులేని అభిమానం ఉందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేస్తూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్న విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన కొనసాగించినప్పుడే ప్రజలు స్వాగతిస్తారన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలలను ఎప్పటికప్పుడు గుర్తించి, ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందన్నారు. అందులో భాగంగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడేందుకు సిద్ధమైందన్నారు. నూతనంగా పార్టీ పదవులు పొందిన వారు వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు మానం బాలిరెడ్డి, కాతా నరసింహారెడ్డి, బాదం గోపాల్, పాలుగుళ్ల నరసింహారెడ్డి, స్వామి రంగారెడ్డి, గోడి వెంకటేశ్వరరెడ్డి, పోలెపల్లె శివ, మిత్రా రెడ్డి, కుక్కా సాంబ, బొర్రా కృష్ణారెడ్డి, ఓబులేసు, బ్రహ్మయ్య, ఎం.శ్రీను, దప్పిలి భాస్కర్‌రెడ్డి, కుక్కా మల్లికార్జున, దాసరి వెంకటసుబ్బయ్య, జక్కా శ్రీను, అల్లం ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి

● ఎన్నికల వేళ ఉద్యోగులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
● కూటమి ప్రభుత్వానికి ఎస్టీయూ డిమాండ్


మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్రయ్య

కంభం: సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఉద్యోగులకు తగిన న్యాయం చేస్తానని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిలబెట్టుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య డిమాండ్ చేశారు. కంభం మండల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి ఏపీజీఎల్ఐ, జెడ్పీ పీఎఫ్, సర్వీస్ రెగ్యులైజేషన్, మెడికల్ బిల్లులు తదితర సమస్యలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు 9.30 గంటలకు పూర్తి చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తేవడం వల్ల మానసిక ఆందోళనకు గురవుతున్నారన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న అందరికీ వర్తించేలా ఉన్న ఆప్షనల్ హాలిడేస్ విధానాన్ని 50 శాతం మందే వినియోగించుకునేలా ప్రస్తుత కమిషనర్ ఆదేశాలివ్వడం సరికాదన్నారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి డి.సిద్దిక్, మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షఫీ, అంకయ్య, అర్ధవీడు మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కౌన్సిలర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మొహర్రం వేడుకలు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో శుక్రవారం నుంచి 4 రోజులపాటు మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు. కొమరోలులోని పెద్ద పీర్లచావిడి, చిన్న పీర్లచావిడి వద్ద 7వ తేదీ వరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం చిన్న షహాదత్, 5వ తేదీన పగలు షహాదత్, 6వ తేదీన పెద్ద షహాదత్, 7వ తేదీన పీర్ల ఉత్సవం, అగ్ని గుండం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

పైపుల లీకేజీతో నీరు వృథా


వృథాగా పోతున్న నీరు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని పలు వీధుల్లో కుళాయి పైపుల లీకేజీ కారణంగా నీరు నిత్యం వృథాగా పోతోంది. మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యమే అందుకు కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. స్థానిక ఐరీష్ లాడ్జి వద్ద, పోలీస్ స్టేషన్ రోడ్డులోని డ్రైనేజీ కాలువల్లో ఉన్న కుళాయి పైపులకు లీకేజీలు ఏర్పడటంతో నీరు వృథాగా పోవడమే కాకుండా కలుషితమవుతోందని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువల్లో పైపులు ఉండటం వల్ల తుప్పు పట్టి పైపులకు రంధ్రాలు ఏర్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి డ్రెయినేజీల్లోని పైపులను సరిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాబా అఖండ పారాయణం పూర్తి


సాయి జీవిత చరిత్ర పారాయణం చేస్తున్న భక్తులు

మార్కాపురం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయిబాబా మందిరంలో గత నెల 26వ తేదీ నుంచి 600 మంది భక్తులతో నిర్వహించిన బాబా జీవిత చరిత్ర అఖండ పారాయణం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కృష్ణమోహన్, కరీం తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్

కొమరోలు: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. కొమరోలులోని పాత ఆంధ్ర బ్యాంక్ వద్ద ప్రధాన రహదారిపై ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. గిద్దలూరుకు చెందిన శ్రీనివాసులు పని నిమిత్తం కొమరోలుకు రాగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. శ్రీనివాస్ కాలికి తీవ్రగాయం కావడంతో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. మండలంలోని నారాయణపల్లె గ్రామానికి చెందిన శివారెడ్డి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై గిద్దలూరు వెళ్తుండగా దద్దవాడ సమీపంలోని అమరావతి–అనంతపురం జాతీయ రహదారిపై బైక్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

7న ఒంగోలులో మాదిగ మహామేళ


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అర్ధవీడు: ఒంగోలులో ఈ నెల 7న నిర్వహించనున్న మాదిగ మహామేళ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పానుగంటి షాలేంరాజు కోరారు. మండలంలోని బొల్లుపల్లి గ్రామంలో గురువారం మహామేళ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఎస్సీ వర్గీకరణ సాధించామన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ ఆధ్వర్యంలో 31వ ఆవిర్భావ దినోత్సవానికి మాదిగలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బాలరజు, రవి, సునెల్, నేదరపల్లి జయరాజ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉర్దూ మోడల్ పాఠశాల తనిఖీ


విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కంభం: స్థానిక అర్బన్ కాలనీలోని ఉర్దూ మోడల్ పాఠశాలను గురువారం మండల విద్యాశాఖాధికారి అబ్దుల్ సత్తార్ తనిఖీ చేశారు. ప్రార్థన నిర్వహణ, విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, పాఠశాలలో రికార్డులు పరిశీలించారు. పాఠశాల సమగ్ర అభివృద్ధిపై విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీ మురళి, ప్రధానోపాధ్యాయురాలు నిర్మల కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ బి-సర్టిఫికెట్లు అందజేత



ఎన్‌సీసీ బి-సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఆర్మీ అధికారులు, ప్రిన్సిపాల్

కంభం: స్థానిక వాసవి విద్యా సంస్థల్లో ఎన్‌సీసీలో శిక్షణ పొందిన 33 మంది ఇంటర్, 22 మంది డిగ్రీ విద్యార్థులకు గురువారం 34 ఆంధ్రా బెటాలియన్ అధికారి సుధీర్, జస్పాల్ సింగ్ బి-సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల్లో దక్కే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయిలో నిలవాలని ప్రిన్సిపాళ్లు వెంకటరెడ్డి, కె.రాము సూచించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

వార్తాలీ వారాహి అలంకారంలో జగదాంబ


వార్తాలీ వారాహిగా భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారు వార్తాలీ వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. 8వ రోజు గురువారం జగదాంబ అమ్మవారిని ఆలయ అర్చకులు ఆంజనేయ ప్రసాద్, వరుణ్‌తేజ, అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పొలాల్లో మోటారు కేబుల్ వైర్లు చోరీ

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు గ్రామ వ్యవసాయ భూముల్లో ముగ్గురు రైతులకు చెందిన డీప్ బోర్ల విద్యుత్ కేబుల్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఉదయగిరి బాలయ్య, మోర్తాల రమణయ్య, మొగుళ్లూరి భీమయ్యకు చెందిన డీప్ బోర్ల విద్యుత్ కేబుల్ కత్తిరించి తీసుకెళ్లడంతో వారు లబోదిబోమంటున్నారు. మోటార్లు యథాప్రకారం పనిచేయాలంటే మళ్లీ వ్యవప్రాయాసాలకు గురికావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పారిశుధ్యం మెరుగుపడాలి


అధ్వానంగా మారిన సీసీరోడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ రంగనాయకులు

బేస్తవారిపేట: గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు సూచించారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పూసలపాడు గ్రామంలో పర్యటించారు. మెయిన్ రోడ్డు ఎత్తుగా ఉండటంతో అంతర్గత సీసీ రోడ్డు మురుగుమయంగా మారడాన్ని గమనించారు. రోడ్డుకు ఒకవైపు డ్రైనేజీ ఏర్పాటు చేసి మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి రంగస్వామికి సూచించారు. డ్రెయినేజీలో పూడికతీత పనులు చేయించాలన్నారు. మంచినీటి సరఫరా, క్లోరినేషన్ పనులను పరిశీలించారు.